సాక్షి తిరుపతి

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



ఉపాధి దారిలో 'డ్రైవింగ్'

తిరుపతి అర్బన్ : ఔత్సాహికులకు ఆర్టీసీ యాజమాన్యం అద్భుతమైన అవకాశం కల్పించింది. తిరుపతిలోని అలిపిరి డిపోలో ఓ స్కూల్‌ను 2020లో ప్రారంభించింది. - 8లో



జాతరమ్మ జాతర

రాపూరు: గ్రామ దేవత రాపూరమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	38	22
తిరుమల	33	18
చిత్తూరు	37	22
గూడూరు	38	23
నగరి	38	23

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6.28	4.42
చిత్తూరు	6.30	4.41
పుంగనూరు	6.32	4.45

న్యూస్‌రీల్

ఆగమోక్తంగా చతుర్థశి పూజలు



హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని అంజి అంజి వినాయకస్వామి గుడి వద్ద ఆదివారం ఆగమోక్తంగా సంకట చతుర్థశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గణపతి హోమం జరిపించారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అధికారి నాగభూషణం, ప్రధాన అర్చకుడు కరుణకార్ గురుకుల్, వేదపండితులు శ్రీవత్సవ , అర్చకుడు అనిల్ శర్మ, పరిచారకుడు రాకేష్‌శర్మ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో చీఫ్ సెక్రటరీ



ధ్వజస్తంభానికి మొక్కుతున్న జవహర్‌రెడ్డి

తిరుమల: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనానంతరం వారికి రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించారు. డిప్యూటీ ఈఓ రమేష్ బాబు తీర్థప్రసాదాలను అందజేశారు.

తిరువణ్ణామలై సర్వీసులతో రూ.8.34లక్షల రాబడి

తిరుపతి అర్బన్ : పౌర్ణమి సందర్భంగా ఈనెల 5, 6 తేదీల్లో తమిళనాడులోని తిరువణ్ణామలైకు నడిపిన ప్రత్యేక బస్సు సర్వీసులతో రూ.8.34లక్షల రాబడి వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఆదివారం వారు మాట్లాడుతూ మొత్తం 27 సర్వీసులు నడిపినట్లు తెలిపారు.

ఘనంగా విద్యాప్రకాశనంద గిరిస్వామి జయంతి



ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో విద్యాప్రకాశనందగిరి స్వామి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సంపూర్ణనందగిరిస్వామి మాట్లాడుతూ జీవులు భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు. మనిషిని సన్మార్గంలో నడిపేందుకు భగవద్గీత ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం వివిధ ఆశ్రమాల నుంచి వచ్చిన పీఠాధిపతులు అనుగ్రహ భాషణం చేశారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఆధ్యాత్మిక వేత్తల ఉపన్యాసాలతో మనసు ప్రశాంతంగా ఉందన్నారు. వందేభారత్ రైలుకు శ్రీకాళహస్తిలో స్టాపింగ్ వచ్చేలా కేంద్రంతో మాట్లాడినట్లు వెల్లడించారు. ఎంపీ, ఎమ్మెల్యేని ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం (యాదమరి): కాణిపాక వినాయక స్వామి ఆలయంలో 3 రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఆలయంలో సంకట హర చతుర్థి వ్రతానికి భక్తులు భారీగా వచ్చారు. ఫలితంగా కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. రూ.150, రూ.100, ఉచిత క్యూలైన్లు ఆలయం వెలుపల వరకు వచ్చాయి. దీంతో ఆలయ ఈవో వెంకటేశు వీఐపీ గేట్‌లకు తాళాలు వేసి సామాన్య భక్తులకు దర్శనం కల్పించారు.

దేవుడికే శఠగోపం!

కాణిపాకం ఆలయంలో ఇంటిదొంగలు పేట్రేగిపోతున్నారు. భక్తులు సమర్పించిన కానుకలను సైతం కైంకర్యం చేసేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి దేవుడికే శఠగోపం పెట్టేస్తున్నారు. సత్యప్రమాణాలస్వామి సన్నిధిలోనే అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆధ్యాత్మికక్షేత్రంలో అందినకాడికి దోచేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో అవినీతి సిబ్బందిపై అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. కట్టుదిట్టంగా నిఘా పెట్టి అవినీతి సిబ్బంది లెక్క తేలుస్తున్నారు. భక్తుల మనోభావాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.



కాణిపాకం వినాయక స్వామి ఆలయం



చోరీకి గురైన సరుకుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు (ఫైల్)

- కాణిపాకంలో సిబ్బంది ఇష్టారాజ్యం
- అన్నదానంలో నిత్యావసరాలు మాయం
- తెరమరుగవుతున్న స్వామివారి విలువైన వస్తువులు!
- రెచ్చిపోతున్న ఇంటి దొంగలు
- గుట్టురట్టు చేస్తున్న ఆలయ అధికారులు

సాక్షి, తిరుపతి/ కాణిపాకం(యాదమరి): సత్య ప్రమాణాల దేవుడు స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకుడి ఆలయంలో ఇంటి దొంగలు రెచ్చిపోతున్నారు. ఏకంగా దేవుడి సొత్తునే దోచుకుంటున్నారు. విలువైన ఆభరణాలను నొక్కేస్తున్నారు. అధికారులు ఈ దోపిడీల గుట్టురట్టుచేస్తున్నారు. జిల్లాలోని ప్రముఖపుణ్యక్షేత్రం కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి నిత్యం 10 వేల నుంచి 15 వేల మంది భక్తులు వస్తుంటారు. కానుకల రూపంలో స్వామివారికి రోజూ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సమర్పిస్తుంటారు. అలాగే విలువైన ఆభరణాలు సైతం ఉంటాయి. అలాగే నిత్యాన్నదానం, ఇతరత్ర వాటికి రూ.లక్షల్లో విరాళాలు వస్తుంటాయి. వీటి నిర్వహణ 17 మంది అర్చకులు, 9 మంది, వేద పండితులు, 5 పర్యవేక్షణ అధికారులు చేతిలో ఉంటుంది. అయితే కొంత మంది సమర్పించే విలువైన ఆభరణాలు, కానుకలు దేవుడి లెక్కల్లోకి చేరడం లేదు. వచ్చిన విరాళాలు, ఆభరణాలను కచ్చితంగా ఆలయ పర్యవేక్షణాధికారులు విరాళాల రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంది. అయితే కొందరు ఈ వివరాలను రికార్డుల్లో రాయకుండా కానుకలు, ఆభరణాలను నొక్కేస్తున్నారు. ఇలాంటివి కొన్ని స్థానికంగా కొందరు ఇచ్చే సమాచారంతో బయటపడుతున్నాయి. మరికొన్ని బయటకు రాకుండా పోతున్నాయి.

ఇదిగో కొన్ని సాక్ష్యాలు

- నిత్యాన్నదానంలో వంటావార్పు చేసే ఏడుగురు సిబ్బంది వేకువజామున సరుకులను అక్రమంగా ఇళ్లకు పట్టుకెళ్లడం, బయటవారికి తక్కువ ధరలకు విక్రయించడం చేస్తున్నారు. దీనిపై నిఘా వేసి పట్టుకున్న అధికారులు రూ.1.3 లక్షల సరుకులను తరలించినట్లు గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేయించారు.
- స్వామివారికి రోజుకు నాలుగు పర్యాయాలు నైవేద్యం సమర్పించాల్సి ఉంది. సుప్రభాతంలో కట్ పొంగలి, ఉదయం 9, 11 గంటలకు నిర్వహించే అభిషేకంలో పులిహోర, బెల్లం పొంగలి, 11 గంటలకు కదంభం(సాంబారు అన్నం), సాయంత్రం సుండల్ స్వామివారికి నైవేద్యంగా పెడతారు. ఈ నైవేద్యం తయారు చేసే అర్చకులు ఇంట్లో శనివారం సోదాలు చేయగా కొద్ది మొత్తంలో సరుకులు దొరికాయి. పూర్తి స్థాయిలో లెక్కలు చూస్తే అసలు విషయాలు బయటపడే అవకాశం ఉంది.
- గత ఏడాది ఆగస్టులో వేలూరు నారాయణి అమ్మన్ ఆలయం వారు వినాయక స్వామివారికి బంగారు పట్టీని బహూకరించారు. ఆ ఆభరణాన్ని లెక్కల్లో ఎక్కించకపోగా గుట్టుచప్పుడు కాకుండా అర్చకులు తన బీరువాలో దాచుకున్నారు. నారాయణిఅమ్మన్ ఆలయం వారు బంగారు విభూది పట్టీ ఇచ్చినట్లు బిల్లు ఇవ్వాలని కోరగా అసలు విషయం బయట పడింది. వెంటనే ఆ అర్చకుడిని ఆలయాధికారులు సస్పెండ్ చేశారు.
- వినాయకస్వామివారి ఆలయానికి అనుబంధమైన మణికంఠేశ్వరస్వామి గుడిలో మరగదాంభిక అమ్మవారికి బంగారుపూతతో చేయించిన తొడుగులను పీలేరుకు చెందిన భక్తురాలు గత ఏడాది అక్టోబర్‌లో అర్చకులకు అందజేశారు. కానీ వారు బిల్లు ఇవ్వలేదు. ఈ మేరకు ఆమె ఆలయాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రస్తుతం విచారణ చేపట్టారు.
- మూడు నెలల క్రితం కాణిపాకం వినాయక ఆలయ అనుబంధమైన వీరాంజనేయ స్వామి గుడిలో నిబంధనలు అతిక్రమించి స్వామివారికి అభిషేకం చేయని అర్చకులను అధికారులు సస్పెండ్ చేశారు.
- కాణిపాకం ఆలయ అనుబంధమై వరదరాజుల స్వామి గుడి అర్చకుడు ఇటీవల సెలవు ఇవ్వలేదని అధికారిని దూషించినందుకు ఆయనను సస్పెండ్ చేశారు. ఈ అర్చకుడి ఇంట్లో శనివారం రాత్రి సోదాలు చేయగా రెండు జింక చర్మాలు బయటపడ్డాయి.

మారని తీరు..!

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి స్వయంభుగా వెలిశారనేది ప్రసిద్ధి. తప్పు చేసిన వారు ఈ పుణ్యక్షేత్రానికి వచ్చి వినాయకస్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణం చేయడానికి వణికిపోతారు. అలాంటి సత్య దేవుడి సన్నిధిలో పనిచేసే కొందరు సిబ్బంది తప్పులు మీద తప్పులు చేస్తున్నారు. సత్యప్రమాణాల దేవుడి సూత్రాలకు విరుద్ధంగా పని చేస్తున్న కొందరు ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నారు. అయినా తప్పులు చేస్తున్న మరికొందరు తీరు మార్చుకోవడం లేదు. స్వామివారి ఇలాకాలో ఎందరు దొంగలు ఉన్నారో బయట పడాల్సి ఉంది.

తప్పు చేసేవారిని దేవుడు విడిచిపెట్టరు



కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి స్వయంభుగా వెలిసిన స్వామి, ఆయన ఆలయంలో ఎవరైనా తప్పులు చేస్తే వదిలిపెట్టరు. దీనిపై ఆలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తప్పులు చేయక, ఆలయ అర్చక వేద పండితులు భక్తితో ఉండాలని కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ స్వామివారి సేవలో ఉంటూ సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా చూడాలి.

– వెంకటేశు, ఆలయ ఈఓ కాణిపాకం

పరిపూర్ణం.. లక్ష్మీకుబేర యాగం



పూర్ణాహుతి సమర్పణలో మంత్రి రోజా, ఇతర ప్రముఖులు

రామచంద్రాపురం: మండలంలోని శ్రీశక్తి పీఠంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న గత నాలుగు రోజులుగా జరుగుతున్న స్వర్ణాకర్షణ భైరవ సహిత లక్ష్మీకుబేర మహాయాగం ఆదివారం పూర్ణాహుతితో పరిపూర్ణమైంది. పీఠం వ్యవస్థాపకులు, కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఆధ్వర్యంలో ఆస్థాన పండితులు రమేష్‌శర్మ అర్చక బృందం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాయాగంలో మంత్రి ఆర్‌కే రోజా, పుదుచ్చేరి మంత్రి చంద్ర ప్రియాంక, ఆల్ ఇండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన్ మణీందర్‌జీత్ సింగ్ బిట్టా పాల్గొన్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం సిద్ధేశ్వరానంద భారతీస్వామి, రమ్యానంద భారతీ అనుగ్రహ భాషణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అగరబత్తుల తయారీ అద్భుతం

- గోమాతలకు వరం ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి

తిరుపతి రూరల్: దైవపూజల్లో వినియోగించిన పుష్పాలతో అగరబత్తులు తయారుచేయాలనే ఆలోచనే అద్భుతమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ప్రశంసించారు. ఆదివారం తిరుపతిలోని గోశాలలో ఇటీవల ప్రారంభించిన అగరబత్తుల రెండో యూనిట్‌తోపాటు ఎస్వీ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ అగరబత్తుల ద్వారా వచ్చే ప్రతి రూపాయినీ గోవుల సంరక్షణ, ఆరోగ్య రక్షణకే వినియోగించాలని సూచించారు. బలవర్ధకమైన సమగ్ర పోషకాలతో టీటీడీ తయారుచేస్తున్న ఫీడ్ మిక్సింగ్ దాణా గోమాతలకు వరమని తెలిపారు. ప్లాంట్‌ను త్వరితగతిన పూర్తి చేసిన టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిని అభినందించారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి మాట్లాడుతూ అగరబత్తుల విక్రయాలతో ఏడాదిన్నరలోనే రూ.8 కోట్ల ఆదాయం వచ్చిందని, రెండో యూనిట్ వల్ల రాబడి రూ.15 కోట్లకు పెరిగే అవకాశముందని వెల్లడించారు. గోశాల డైరెక్టర్ మాట్లాడుతూ ఇండో– అమెరికా సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న దాణా కారణంగా గోవుల్లో పాల దిగుబడి పెరిగిందన్నారు. ఇప్పటి వరకు 204 గోవులను సేకరించామని, త్వరలోనే 500 వరకు తీసుకురానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ సదాభార్గవి పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆస్పత్రి పనులు వేగవంతం

తిరుపతి తుడా: టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. సీఎస్ మాట్లాడుతూ చిన్న పిల్లల ఆస్పత్రిలో అన్ని రకాల చికిత్సలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయంలో 1,300కు పైగా గుండె ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయన్నారు. ఇటీవల రెండు గుండెమార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వర రావు, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ భూముల పరిశీలన

సైదాపురం: జిల్లాలోని సైదాపురం, డక్కిలి మండలాల్లోని 305 ఎకరాల టీటీడీ భూములను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సైదాపురం మండలం పోతేగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన భూముల మ్యాప్‌ను ఆయన అధ్యయనం చేశారు. అనంతరం భూములను విరాళంగా అందించిన దాత మురళీకృష్ణ, టీటీడీ ఈఓ ధర్మారెడ్డితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆ భూముల్లో సేంద్రియ వ్యవసాయం చేసి టీటీడీకి అవసరమైన పండ్లు, కూరగాయలను పండించేలా చర్యలను తీసుకోనున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, నెల్లూరు ఆర్డీఓ మలోల పాల్గొన్నారు.

సాహితీ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు



కళాకారిణి నృత్యభంగిమ

- నిర్విరామంగా 48 గంటలపాటు కొనసాగనున్న వైభవం

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఆదివారం ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు వరల్డ్ రికార్డు సాధనే లక్ష్యంగా మంగళవారం ఉదయం 8 గంటల వరకు 48 గంటల పాటు కొనసాగనున్నాయి. తొలి రోజు దేశవ్యాప్తంగా విచ్చేసిన 1450 మంది కళాకారులు వేదికపై తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. 700 మంది కవితా గానాలు చేయగా, 420 మంది నృత్య ప్రదర్శనలు చేసి అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ ప్రతిభ ఒక్కటే ప్రామాణికంగా వేలాది మంది కవులు, కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. దేశంలోని సుమారు 15 రంగాలకు చెందిన 3 వేల మంది కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కింగ్ ఇంద్ర మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి శ్రీశ్రీ కళావేదిక కృషి ప్రశంసనీయమని కొనియాడారు. కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి గుత్తా హరి సర్వోత్తమనాయుడు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం అందించేందుకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం కోన రమేష్ దర్శకత్వం వహిస్తున్న వస్తాడు నారోజు సినిమా యూనిట్ వేదికపై సందడి చేసింది. ఈ సందర్భంగా చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. కళాకారులు, కవులను జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు కొల్లి రమావతి, అరవ జయపాల్, రొడ్డ సురేంద్ర, రచయిత రాసాని వెంకటరామయ్య, చిట్టి సిద్ధ లలిత, జి.ఈశ్వరీభూషణం, కట్ల భాగ్యలక్ష్మి, సంపత్, అమ్మోజీ పాల్గొన్నారు.

వాస్కులర్ శస్త్ర చికిత్సపై అవగాహన



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ సెంథిల్‌కుమార్

తిరుపతి తుడా : స్విమ్స్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో ఆదివారం సీటీ సర్జరీ విభాగంలోని వాస్కులర్ అనస్టోమోసిస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ వైద్య రంగంలో వాస్కులర్ అనస్టోమోసిస్ అరుదైన శస్త్ర చికిత్సని తెలిపారు. దెబ్బతిన్న నాళంలో రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడానికి, రక్త నాళాలకు అయిన గాయాలను సరిచేయడానికి, రెండు నాళాల మధ్య బైపాస్‌ను రూపొందించడానికి నిర్వహిస్తారని వివరించారు. వైద్య విద్యార్థులు ఇలాంటి అరుదైన చికిత్సలు, సర్జరీలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తమిళనాడుకు చెందిన డాక్టర్ సెంథిల్ కుమార్ ప్రిన్సిపుల్స్ అఫ్ మేనేజ్ మెంట్ ఆఫ్ వాస్కులర్ ఇంజ్యూరీస్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్ భాను, డాక్టర్ ముక్తేశ్వరయ్య, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వాసుదేవరెడ్డి, డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ శ్రీ సత్యవతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

నాయుడుపేటటౌన్:క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని బేరిపేట ఎస్‌ఏఎల్‌సీ చర్చి, రోమన్ కేథలిక్ చర్చి సమీపంలోని సమాధి తోటలను వివిధ పుష్పాలతో అలంకరించారు. వేకువజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ రైట్ రెవరెండ్ ఓ మైకల్ బెన్‌హర్ దైవ సందేశాలను వివరించారు. పరిశుద్ధ కేతూరు కొలు సంఘం చైర్మన్ కేఎం ఆనందరావు, కళాచంద్, మాజీ పీసీసీ చైర్మన్ కేజే జ్ఞానందం, సండే స్కూల్ కరస్పండెంట్ ప్రేమ్‌చంద్, పాల్గొన్నారు.





సమాధి తోటల వద్ద ప్రార్థనలు, దైవసందేశం వినిపిస్తున్న ఎస్‌ఏఎల్‌సీ చర్చి బిషప్

క్లుప్తంగా

కత్తితో వ్యక్తి హల్‌చల్

గూడూరు : పట్టణంలోని ముత్యాలపేటలో ప్రకాష్ అనే వ్యక్తి కత్తి పట్టుకుని అందరినీ బెదిరిస్తూ హల్‌చల్ చేశాడు. దీంతో దుకాణదారులు, ఆ మార్గంలో వెళుతున్న వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురయ్యారు. అతడికి మతిస్థిమితం లేకపోడంతో కత్తితో ఎవరిని ఏం చేస్తాడో అని బెంబేలెత్తిపోయారు. ఈ క్రమంలో ఓ దుకాణంలో జొరబడిన ప్రకాష్‌ను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతడి బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

ట్యాంకర్ ట్రాలీ బోల్తా : ఒకరి మృతి

భాకరాపేట : మండలంలోని కస్తూర్బా పాఠశాల వద్ద మలుపులో ఆదివారం ఓ ట్రాక్టర్ ట్యాంకర్ ట్రాలీ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఎర్రావారిపాళానికి చెందిన రైతు మామిడి చెట్లకు పురుగుమందు పిచికారీ చేసేందుకు ఓ ట్రాక్టర్ ట్యాంకర్ ట్రాలీ బయలుదేరింది. మార్గంమధ్యలో అదుపుతప్పి బోల్తాపడడంతో ట్యాంకర్‌పై కూర్చున్న కూలీలు పుట్టకాయల సుబ్రమణ్యం(47), రామ్మూర్తి(47) కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యం అక్కడికక్కడే మరణించగా, రామ్మూర్తికి రెండు కాళ్లు విరిగిపోయాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి దారిలో డ్రైవింగ్

- అలిపిరి ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ శిక్షణ
- ఇప్పటి వరకు 19 బ్యాచ్‌లకు ట్రైనింగ్
- హెవీ లైసెన్స్‌తో ఉద్యోగావకాశాలు
- 15 నుంచి 20వ బ్యాచ్ ప్రారంభం
- 17 నుంచి 21వ బ్యాచ్‌కు దరఖాస్తులు



సర్టిఫికెట్ల పంపిణీ



డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న వారు

తిరుపతి అర్బన్ : హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారికి దేశవిదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. హెవీ లైసెన్స్ పొందేందుకు భారీ వాహనాలు నడపడంలో శిక్షణ అవసరం. ప్రైవేటుగా శిక్షణ తీసుకుంటే పెద్ద మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఔత్సాహికులకు ఆర్టీసీ యాజమాన్యం అద్భుతమైన అవకాశం కల్పించింది. జిల్లాకు ఓ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేసింది. నామమాత్రపు ఫీజుతోనే పక్కాగా డ్రైవింగ్‌లో శిక్షణ అందిస్తోంది. అందులో భాగంగా తిరుపతిలోని అలిపిరి డిపోలో ఓ స్కూల్‌ను 2020లో ప్రారంభించింది. ఒక్కో బ్యాచ్‌లో 16 మందిని డ్రైవింగ్‌తోపాటు మెకానిజంలోనూ పట్టుసాధించేలా తీర్చిదిద్దుతోంది. ఈ నెల 13వ తేదీకి 19వ బ్యాచ్‌కు శిక్షణ పూర్తి కానుంది. అనంతరం 15వ తేదీ నుంచి 20వ బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభించనున్నారు. అలాగే 21వ బ్యాచ్‌లో ప్రవేశానికి 17వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

శిక్షణ ఇలా..

బ్యాచ్‌కు ఎంపికైన తర్వాత తొలి 16 రోజులు థియరీ క్లాస్‌లు ఉంటాయి. తర్వాత 16 రోజులు క్షేత్రస్థాయిలో డ్రైవింగ్ శిక్షణ ఉంటుంది. 8రోజులు ట్రాఫిక్ నిబంధనలు, చిహ్నాలపై అవగాహన కల్పిస్తారు. శిక్షణ అనంతరం స్కూల్ నిర్వాహకులు ఫారం-5, ఫారం-14, ఫారం-15కు సంబంధించి సర్టిఫికెట్లు అందజేస్తారు. సదరు పత్రాలతో ఆర్టీఓ కార్యాలయానికి వెళితే వాటిని పరిశీలించి హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం లైసెన్స్ పొందినవార్లు పెద్ద వాహనాలను నడిపేందుకు అర్హత సాధిస్తారు.

దరఖాస్తుకు అర్హతలు

లైట్ మోటార్ వెహికల్ (ఎల్‌ఎంవీ)లైసెన్స్ తీసుకుని ఏడాది పూర్తి అయిన వారే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో చేరేందుకు అర్హులు. వయస్సు 18 నుంచి 40ఏళ్లు మాత్రమే ఉండాలి. 10వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి.అర్హతలుగల వారు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఉద్యోగావకాశాలు

అలిపిరి డిపోలో ఒక్కో బ్యాచ్‌కి 40రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. వెంటనే లైసెన్స్ జారీ చేస్తున్నారు. ఆర్టీసీ కాంట్రాక్ట్ డ్రైవర్లుగా, ఎలక్ట్రికల్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేసే అవకాశం కల్పించనున్నారు. 108లో సైతం ఉద్యోగం అందిస్తున్నారు.

ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌గా..



అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందా. త్వరలో ఎలక్ట్రికల్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేయడానికి అవకాశం కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మాతో శిక్షణ పొందిన వారిలో కొందరు కాంట్రాక్ట్ విధానంలో ఆర్టీసీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. హెవీ లైసెన్స్ వచ్చినవాళ్లంతా ఏదో ఒకచోట డ్రైవింగ్ ఫీల్డ్‌లోనే ఉపాధి పొందుతున్నారు.

– రెడ్డెప్ప, కలికిరి



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,310
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,566
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,200
రిటైల్ వెండి గ్రాము	రూ.78.20

ఎంతో ప్రయోజనకరం



ఆర్టీసీ డిపోల్లో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనకరం. శిక్షణ ఇచ్చి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడం ఆనందంగా ఉంది. తిరుపతి అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందా. ఇప్పటికే ఇంజినీరింగ్ పూర్తి చేశా. హెవీ లైసెన్స్ ఉంటే ఫైర్ ఆఫీసర్‌గా ఉద్యోగం వస్తుంది.

– విజయబాబు, గుడివాడ, కృష్ణాజిల్లా

సంతోషంగా ఉంది



శ్రీవారి పాదాల చెంత అలిపిరి డిపో డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేయడం సంతోషంగా ఉంది. ఇక్కడ శిక్షణ పొందిన వారికి ఉద్యోగం వస్తుంటే అదో సంతృప్తి. ఎలక్ట్రిక్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేసేందుకు 115 మంది కావాలని అడిగారు. ఆ మేరకు జాబితా పంపించాం. త్వరలోనే వారికి ఉద్యోగాలు వస్తాయి.

– ఎస్.హరిబాబు, అలిపిరి డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్

సకల వసతులు



“ అలిపిరి డిపో డ్రైవింగ్ స్కూల్‌లో సకల వసతులు కల్పించాం. అందుకే జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం శిక్షణ పొందేందుకు వస్తున్నారు. రాష్ట్రంలోనే తిరుపతి స్కూలు ముందు వరుసలో ఉంది. ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు ఎవరూ ప్రస్తుతం ఖాళీగా లేరు. మరో నాలుగురోజుల్లో 21వ బ్యాచ్‌కు దరఖాస్తులు స్వీకరించనున్నాం.

– చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, తిరుపతి

'అమ్మస్వప్నం' నవల ఆవిష్కరణ

పలమనేరు: పట్టణంలోని తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి కళామందిరంలో చిత్తూరు కట్టమంచికి చెందిన రచయిత్రి కృష్ణవేణి రచించిన అమ్మ స్వప్నం నవల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. సభాధ్యక్షుడు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేసేలా ఉండాలన్నారు. సమాజాన్ని మార్చగల శక్తి కేవలం సాహిత్యానికే ఉందన్నారు. స్థానిక రచయిత పలమనేరు బాలాజీ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్ : ముగ్గురికి గాయాలు

నాయుడుపేటటౌన్ : మండలంలోని అన్నమేడు వద్ద ఆదివారం రాత్రి ఆటోను బైక్ ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన పట్టుకోట గోపాలయ్య అనే వృద్ధుడు నాయుడుపేట నుంచి ఆటోలో వస్తుండగా వెంకటగిరికి చెందిన వినయ్, కిరణ్ బైక్‌తో ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

పార్టీ కోసం పనిచేసేవారికే పదవులు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఢిల్లీబాబురెడ్డి, సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి రూరల్ : వైఎస్సార్‌సీపీ కోసం నిజాయితీగా పనిచేసేవారికి పదవులు కచ్చితంగా వస్తాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు వారికి ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కాపిరెడ్డి ఢిల్లీబాబురెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దాసా సుబ్రమణ్యం అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడే ప్రతి ఒక్కరికీ పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. బాధ్యతాయుతమైన పదవులను సద్వినియోగం చేసుకుని నిత్యం ప్రజలతో మమేకమవుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ జరగని రీతిలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో తొలి రెండేళ్లు కరోనా కారణంగా కొంత వెనుకబడినా, తర్వాత అభివృద్ధిలో పరుగులు తీస్తున్నామని తెలిపారు. వాగవేడు, అమ్మపాళెం, ఓబులాయపల్లె, పొయ్య తదితర గ్రామాలను కలుపుతూ రింగ్‌రోడ్లు నిర్మించామన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో హిందూ శ్మశనవాటిక, స్వర్ణముఖినది కరకట్ట ఆధునికీకరణ, కొండచుట్టూ సీసీరోడ్లు నిర్మించామని వెల్లడించారు. అలాగే రూ.వేల కోట్లు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. త్వరలో శ్రీకాళహస్తి నుంచి ముచ్చువోలు మీదుగా పల్లం దళిత కాలనీ వరకు బీటీరోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్ పేరుతో ఫేక్ వీడియోలు పెడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతలకు ధైర్యం ఉంటే తాను చెప్పిన అభివృద్ధి పనుల దగ్గరకు వెళ్లి సెల్ఫీ చాలెంజ్ చేయాలని సవాల్ విసిరారు. నియోజకవర్గాన్నే పట్టించుకోని బొజ్జల కుటుంబాన్ని ప్రజలు ఐదు పర్యాయాలు గెలిపిస్తే, నిత్యం అందుబాటులో ఉంటూ జన హితం కోసం పరితపిస్తున్న తనను ఎన్నిసార్లు ఆశీర్వదిస్తారో టీడీపీ నేతల ఊహకే వదిలేస్తున్నానని తెలిపారు. అనంతరం ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఢిల్లీబాబురెడ్డి, సుబ్రమణ్యం గజమాలతో సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సంధ్య, నేతలు ఉన్నం వాసుదేవ నాయుడు, గుమ్మడి బాలకృష్ణయ్య, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గెరటారెడ్డి, భాస్కర్, కోవి చంద్రయ్యనాయుడు, నంద, పసల సుమతి, చందమామల కోటయ్య, మహేష్‌రెడ్డి, సాగిరబీ, వయ్యాల మనోహర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, చంద్రశేఖర్, వీరరాఘవరెడ్డి, సుబ్బయ్య, శ్రీవారి సురేష్, శ్యామల, రుష్యేంద్రమణి, సుబ్రమణ్యంయాదవ్, నాగభూషణ్‌యాదవ్, పసల కృష్ణయ్య, మునిరెడ్డి పాల్గొన్నారు.

కోనేటిరాయస్వామిని సేవలో సినీనటి రమాప్రభ



గంగవరం: మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం కీలపట్లలో ఉన్న కోనేటి రాయస్వామివారిని సినీనటి రమాప్రభ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు ఆధ్వర్యంలో ఆమెకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాటు చేశారు. ఆలయాధికారులు రమాప్రభను సత్కరించి, కోనేటి రాయస్వామివారి ప్రతిమను అందజేశారు. ఆమె మాట్లాడుతూ చిత్తూరు నుంచి నేరుగా కీలపట్లకు స్వామివారి దర్శనార్థమై విచ్చేశానని చెప్పారు. కీలపట్లలో కోనేటిరాయస్వామివారి దర్శనం చేసుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. కీలపట్లకు రావడం ఇది రెండోసారని ఆమె తెలిపారు.

చిత్తూరుకు చేరిన బైక్ రైడర్స్ ర్యాలీ



చిత్తూరులో బైక్ రైడర్స్

చిత్తూరు అర్బన్: గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీతలు, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు చెందిన దిలీప్ రెడ్డి బృందం చేపట్టిన బైక్ ర్యాలీ ఆదివారం చిత్తూరు చేరుకుంది. ఈనెల 22న జరిగే వరల్డ్ ఎర్త్ డేని పురస్కరించుని అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ బెంగళూరు నుంచి ప్రారంభమై కోలారు మీదుగా చిత్తూరు చేరుకుంది. వారు స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటి వాటి ఆవశ్యకతను వివరించారు. ఇక్కడ నుంచి వేలూరు, కృష్ణగిరి, హోసూరు మీదుగా ర్యాలీ నిర్వహించనున్నామని వారు పేర్కొన్నారు. చిత్తూరుకు విచ్చేసిన బైక్ రైడర్స్ పవిత్ర, రవి, అనిల్, రేష్మ, ఐశ్వర్య, స్నిగ్ధ, సుహస్, వెంకటేష్‌ను టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం బృందం రాక్స్ అధ్యక్షుడు చందు ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కేశవ, లోకేష్, నాని, టీం రాక్స్ సభ్యులు స్వాగతం పలికారు.

సారా స్వాధీనం

చిత్తూరు అర్బన్ : మండలంలోని తుమ్మిందలో ఆదివారం ఎస్‌ఈబీ అధికారులు 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. గ్రామంలోని మామిడితోటలో సారా తయారీ కేంద్రంపై దాడి చేశారు. సారా తయారు చేస్తున్న రాజేష్(34) అనే వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు తదితరులు పాల్గొన్నారు.

నమ్మకం.. భవిష్యత్తు నువ్వే!

అధినేతపై అభిమానం.. జనం చిరునవ్వులో మెరిసిన ఆనందం.. సంక్షేమ సవ్వడులతో విరిసిన సంతోషం.. అడుగడుగునా ఆత్మీయ పలకరింపులు.. ప్రభుత్వ పథకాలను వివరిస్తుంటే ఎదురొస్తున్న ప్రజా మన్ననలు.. ఉత్సాహంగా కదంతొక్కుతున్న యువత.. అవ్వాతాతలు చూపిస్తున్న మమత.. నువ్వే మా నమ్మకం .. మా భవిష్యత్ నువ్వే జగన్ అంటూ ప్రజానీకం నినదిస్తుంటే.. ఇంటింటా జనంతో మమేకమవుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు పులకరిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలకరిస్తున్నారు. ప్రభుత్వ విధి విధానాలను వివరిస్తున్నారు.

– సాక్షి, తిరుపతి



పుత్తూరు మండలం వేపగుంట దళితవాడలో మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా



చిత్తూరులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు..



పుంగనూరులో ఎంపీ రెడ్డెప్ప..



తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



తడలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య